క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం



లక్ష్మిప్రియను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన బీజేపీ నేత మల్చాలం మురళీ కూతురు లక్ష్మిప్రియ ఆల్ ఇండియా నీట్‌లో 6650 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు విద్యార్థిని సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ప్యాట అశోక్, వంశీకృష్ణ, విజయ్‌కుమార్, సుబ్రమణ్యం, కిషోర్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

కీర్తి స్పందనకు డాక్టరేట్



కీర్తి స్పందనకు డాక్టరేట్ అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ క్రిష్టఫర్

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు నేటి సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ క్రిష్టఫర్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల ఆ యూనివర్సిటీలో కీర్తి స్పందన గణిత శాస్త్ర విభాగంలో తర్మల్ అండ్ సొల్యూషన్ ఎఫెక్ట్ ఆఫ్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్ ఫ్లో కంప్యూటేషన్స్, పబ్లికేషన్స్ అనే అంశంపై ఆచార్య ఎం.సుందర్‌రామ్, ఎండీ షంషూద్దీన్ పర్యవేక్షణలో కీర్తి స్పందన పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనతో కీర్తి స్పందనకు డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ క్రిష్టఫర్ అధ్యాపకులతో కలిసి గురువారంఆమెకు డాక్టరేట్‌ను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికారెడ్డి, రవీందర్, జగదీశ్వర్, సుందర్ రామ్, రాజు, అధ్యాపకులు, పబ్లిక్‌రిలేషన్ అధికారి రాంబాబు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏఓ సురేశ్‌బాబు



విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సురేశ్‌బాబు, పోలీసులు

శంకర్‌పల్లి: దుకాణ యజమానులు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాల్లో పోలీసులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలను అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. లూజ్ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. దుకాణదారులు విత్తనాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని, సీడ్ స్టాక్ రిజిస్టర్, గ్రౌండ్ స్టాక్, బిల్‌బుక్‌లను ఖచ్చితంగా మెయింటెన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న చంద్రశేఖర్, కార్తీక్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొండ చంద్రశేఖర్ దంపతుల సహకారంతో డాక్టర్ కొండ కార్తీక్ దంపతులు గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశామని వారు తెలిపారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రజల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు.

లక్ష్యం కన్నా.. సంరక్షణ మిన్న

- హరితహారానికి ముమ్మర ఏర్పాట్లు
- నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు
- మండలంలో 1.30లక్షల పెంపకమే లక్ష్యం
- వానలు పడగానే ప్రారంభించాలని యోచన



కక్కులూర్ నర్సరీలో సిద్ధంగా మొక్కలు

షాబాద్: వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు. 10వ విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికలు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఈసారి భారీ లక్ష్యాన్ని నిర్దేశించకుండా నాటిన మొక్కలన్నింటినీ సంరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు కొన్నిచోట్ల ఏపుగా పెరిగాయి. మరికొన్ని గ్రామాల్లో నాటిన ఆనవాలు లేకుండా పోయాయి. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న చోట మొక్కలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. గతంలో ఆదేశించినట్లుగా కాకుండా లక్ష్యాన్ని సగానికి తగ్గించారు. నాటిన మొక్కలను బతికించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. హరితహారం కార్యక్రమం ఈ నెలలో ప్రారంభం కానుంది. ప్రతి పంచాయతీకి 3 వేల చొప్పున మొక్కలు నాటాలన్నా లక్ష్యం ఉంది. ఈసారి మండలంలో 1 లక్ష 30 వేల టార్గెట్ విధించారు.

గ్రామానికి ఒక నర్సరీ..

మండలంలో 41 పంచాయతీలకు గాను అన్ని గ్రామాల్లోనూ నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ఎప్పటికప్పుడూ కార్యదర్శులు నర్సరీలను పర్యవేక్షిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. నర్సరీలో సుమారుగా 20 రకాల పండ్ల, పూల మొక్కలతో పాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. మొక్కలకు జియో ట్యాంగింగ్ చేస్తున్నారు. ఈ సారి నాటే ప్రతి మొక్క పెరిగేందుకు ఇటు అధికార యంత్రాంగం, అటు ప్రజాప్రతినిధులు, ప్రజల చొరవ తీసుకుంటే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి



10వ విడత హరిహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం. అన్ని శాఖల పరిధిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేశాం. జూన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతోంది. ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల సహకారం పూర్తిస్థాయిలో అవసరం. అందరూ భాగస్వాములు అయితేనే లక్ష్యాన్ని చేరగలుగుతాం.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

ఈటల, కొండాను కలిసిన నాయకులు



ఈటల రాజేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న చేవెళ్ల నాయకులు

చేవెళ్ల: ఎంపీలుగా గెలిచిన బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను చేవెళ్ల బీజేపీ నాయకులు వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం వారి నివాసాలకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మల్కాజ్‌గిరి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఈటల రాజేందర్‌ను చేవెళ్ల బీజేపీ నాయకులు ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, ఎ.శ్రీనివాస్, యాదగిరి, రాంచందర్, శంకరచారి, జైపాల్‌గౌడ్, హనుమంతు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల ఎంపీగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్ల మండల బీజేపీ నాయకులందరూ కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారన్నారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. చేవెళ్ల ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారన్నారు. ఆయనను కలిసిన వారిలో చేవెళ్ల మండల నాయకులు, కార్యకర్తలు ఎం.వైభవ్‌రెడ్డి, అశోక్, ఇంద్రాసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, జయసింహ్మారెడ్డి ఉన్నారు.



కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన మండల నాయకులు

మూడునెలలు అవుతున్నా జీతాలు ఇవ్వరా?

కార్యదర్శిని నిలదీసిన పంచాయతీ సిబ్బంది, కార్మికులు



పంచాయతీ కార్మికులకు నచ్చజెబుతున్న కార్యదర్శి సంధ్యారాణి

మొయినాబాద్‌రూరల్: పంచాయతీ సిబ్బంది, కార్మికులు మూడునెలలు అవుతున్నా జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని, తామెట్లా బతకాలని పంచాయతీ కార్యాదర్శి సంధ్యారాణిని నిలదీశారు. గురువారం మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులందరూ ఈ రోజు నుంచి మేము పనుల్లోకి వెళ్లమని, నెలనెలా జీతాలు ఇవ్వాల్సి ఉన్నా కానీ మూడునెలల నుంచి మా జీతాలు రాలేదని మేం ఎలా బతకాలని అని ఆమెను అడిగారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ.. ప్రతి నెల మీ అటెండెన్స్‌ను రిజిస్టర్ మూమెంట్ ప్రకారం చెక్కు రాసి పంపించామన్నారు. 2, 3 రోజుల్లో మీ అకౌంట్‌లలో జీతాలు పడతాయని తెలపడంతో ఉదయం నుంచి 11 గంటల వరకు పంచాయతీ కార్యాలయంలో ఉన్న సిబ్బంది కార్యదర్శి మాటకు పనుల్లోకి వెళ్లిపోయారు. సంధ్యారాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారి వేతనాలు నెలనెలా అటెండెన్స్ పంపుతున్నామని, కానీ రావడం ఆలస్యం అవుతుందని తెలిపారు. ఈ సమస్య రాకుండా చూస్తానన్నారు.

నేడు మండల సమావేశం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతారని పేర్కొన్నారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేధికలతో సమయానికి రావాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని గ్రామాల ఎంపీటీసీలు తప్పక హాజరుకావాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. గురువారం మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 19వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. గ్రామంలో ఖాళీగా, పనులకు వెళ్లే చిన్నారులను గుర్తించి వెంటనే వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా విద్యా ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి మౌలిక సదుపాయాల మరమ్మతులు పూర్తి కావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రమీల, హెచ్‌ఎం బాలమణి తదితరులు ఉన్నారు.

ప్రతిపాదనను స్వీకరించాలి



తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొందుర్గు: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాజముద్ర తయారీ తమ ప్రతిపాదనను స్వీకరించాలని డీఎస్పీ నాయకులు గురువారం కొందుర్గు తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చిహ్నం మార్పు చేసే విషయాన్ని తాము స్వాగతిస్తున్నామని, చిహ్నంలో ఉస్మానియా యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్, పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, సమ్మక్క, సారలమ్మ చిత్రాలు వచ్చేలా పొందించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవీందర్, నాయకులు రాములు, పెటయ్య, గోపాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



కొందుర్గు: జిల్లేడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

మొయినాబాద్: ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి వెంకటయ్య, ఎంపీడీఓ సంధ్య అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని చిలుకూరు, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యతను పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లలను సైతం బడిలో చేర్పించే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా చిలుకూరు, నాగిరెడ్డిగూడ, శ్రీరాంనగర్ తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం జిల్లేడ్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని విద్యార్థులను ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విల్సన్ సునీల్, పాఠశాల హెచ్‌ఎం పతంజలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

కేశంపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న బడిబాటను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయులతో బడిబాట కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు లలితమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: కొత్తపేటలో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో విద్యార్థులు

మొయినాబాద్: మండల పరిధిలోని బాకారం జాగీర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో గురువారం సమ్మేళనం నిర్వహించారు. పద్దెనిమిదేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన వారందరూ మళ్లీ ఒకచోట చేరి నాటి మధుర స్మృతులు, తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులపై చర్చించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. రోజంతా మిత్రులతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



గురూజీ సందేశం, ప్రవచనాలు వింటున్న భక్తులు

కందుకూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి పేర్కొన్నారు. ప్రతి నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయం గడిపితే, ఆధునిక సమాజంలో ఆటుపోట్లను తట్టుకుని నిలబడే శక్తి లభిస్తుందని ఆయన సూచించారు. అమావాస్యతో పాటు శని జయంతిని పురస్కరించుకొని గురువారం మండలంలో పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమస్యలు, రోగాల నివారణ కోసం ప్రత్యేకంగా హోమం, పూర్ణాహుతి చేశారు. అనంతరం భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు, సందేశం ఇచ్చారు. సమస్యలు లేని జీవితం అనేది ఉండదని, ఆ సమస్యలను ఎదుర్కొని, పరిష్కరించుకునే మార్గం భగవంతుడి సాధనతోనే సాధ్యమవుతుందన్నారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి తోటి వారితో స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ శంకర్ రాథోడ్



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ శంకర్ రాథోడ్, ఉపాధ్యాయులు

షాద్‌నగర్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఎంఈఓ శంకర్ రాథోడ్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో గల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయమ్మ ఆధ్వర్యంలో బడిబాట కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించాలన్నారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు తల్లిదండ్రులు బాటలు వేయాలని సూచించారు. విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక సదుయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించడంతో పాటు పౌష్టిక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌యం కృష్ణయ్య, పంచాయితీ సెక్రటరీ శ్వేత, అంగన్‌వాడీ టీచర్లు మమత, సుజాత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు యశోదమ్మ, ఎంపీడీఓ బన్సీలాల్, గ్రామస్థులు వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడులను బలోపేతం చేయాలి

ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని షాబాద్ ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్, షాబాద్, మాచన్‌పల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠ శాలలను నిర్వహించాలన్నారు. గ్రామా ల్లోని పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకుంటూ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. అందుకు గ్రామంలో యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళల సహకారం అవసరం అన్నారు. నేటి నుంచి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు లక్ష్మణ్, గోవింద్, యామిని, హన్మంతు, ప్రశాంత్, ఎల్.నర్సింహులు, భిక్షపతి, తదితరులు ఉన్నారు.